
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
ఆదివారం 14 సెప్టెంబరు 2025



తెల్లవారక ముందే పల్లె లేస్తోంది..



చందుర్తి మండలం మూడపల్లిలో చెప్పుల వరస



తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో రైతుల బారులు

- జిల్లాలో యూరియా కోసం రైతుల తండ్లాట
- ఎరువుల కేంద్రాల వద్ద బారులు
- బస్తా కోసం రోజంతా పడిగాపులు
- 2.41 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెల్లవారకముందే పల్లెలేస్తోంది. రైతులందరిని తట్టి లేపుతోంది. వ్యవసాయ పనులకు పరుగులు తీయాల్సిన రైతులు ఎరువుల కోసం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, గ్రోమోర్ కేంద్రాలు, రైతు వేదికలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. నిలబడే సత్తువలేక ఆధార్ కార్డులు, పాసుబుక్కులు, చెప్పులు, పాలడబ్బాలను వరుసలో పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఇబ్బందులు ఉన్నా జిల్లా రైతులకు యూరియా కష్టాలు ఎక్కువగానే ఉన్నాయి. నిరంతరం వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. స్వయంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఎరువుల విక్రయ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. యూరియా కొరత ఎప్పుడు తీరుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిరసనలు.. ఆందోళనలు.. వాగ్వాదాలు..

యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు నిరసనలు, ఆందోళనకు దిగుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, గ్రోమోర్ కేంద్రాల వద్ద ఎరువుల కోసం బారులు తీరుతున్న రైతులు సహనం నశించి రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలకు దిగుతున్నారు. సిబ్బందితో వాగ్వాదం పెట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ఎరువులు పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎరువులు వస్తున్నాయని తెలియడంతోనే రైతులు తెల్లవారుజాము నుంచే క్యూలు కడుతున్నారు. పొద్దంతా యూరియా కోసం క్యూలు కట్టిన ఒక బస్తా మాత్రమే దొరుకుతోంది. దానికి కూడా గ్యారెంటీ లేని పరిస్థితిలో రైతులు ఆందోళన చేస్తున్నారు. శనివారం చందుర్తి మండలం మూడపల్లిలో అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. మండల కేంద్రంలో టోకెన్ల కోసం రైతులు బారులు తీరి ఇబ్బందులు పడ్డారు. గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇబ్బంది పడడం కనిపించింది. తంగళ్లపల్లి మండలం జిల్లెళ్ల మిగతా 8వ పేజీలో

ఇప్పటివరకు 16,897 మెట్రిక్ టన్నులు సరఫరా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్ సంబంధించి వ్యవసాయశాఖ యాక్షన్ ప్లాన్ ప్రకారం యూరియా 25370 మెట్రిక్ టన్ను అవసరం అవుతుందని అంచనా వేశారు. కానీ జిల్లాకు ఇప్పటివరకు 16897 మెట్రిక్ యూరియా సరఫరా చేశారు. ప్రస్తుతం సాగు పనులు పూర్తి కావడంతో 21 వేల టన్నుల యూరియా వస్తే రైతులకు సరిపోతుందని చెబుతున్నారు.

ఒక్క బస్తా కూడా దొరకలే..
దరావత్ గోరి, కిష్టునాయక్ తండా, ఎల్లారెడ్డిపేట



నాకున్న రెండు ఎకరాల్లో వరి పంటను వేశాను. యూరియా కోసం మూడు రోజుల నుంచి తిరుగు తున్నా. రోజూ క్యూలో నిలబడేందుకు ఇబ్బంది అవుతోంది. ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా దొరకలే. మా కష్టాలను చూసి యూరియా అందించాలి.

రాత్రి వరకు పడిగాపులు..
గుండెల దేవరాములు, ముస్తాబాద్



ఇంతకు ముందు ఐకేపీ సెంటర్‌లో యూరియా కోసం చూసినా దొరకలేదు. మళ్లీ మూడు రోజులుగా గ్రోమోర్ చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు యూరియా ఇవ్వలేదు. టోకెన్ ఉన్నా ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

తెల్లవారకముందే నిలబడ్డాను..
మెడుదుల భవాని, తంగళ్ళపల్లి



తెల్లవారుజామున ఐదు గంటల నుంచి యూరియా కోసం క్యూలైన్లో నిలబడ్డాను. నాకు శనివారం ఉపవాసం. ఉదయం నుంచి మంచినీళ్లు కూడా తాగలేదు. యూరియా కోసం ఇన్ని తిప్పలు ఎప్పుడూ పడలేదు.







ముస్తాబాద్‌లో రైతుల క్యూ, ఎల్లారెడ్డిపేటలో పోలీసు బందోబస్తు, ఎరువుల పంపణీని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా(ఫైల్)

ఫిరాయింపు ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని నేతన్న విగ్రహం వద్ద ఫిరాయింపు ఎమ్మెల్యేల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ బీ ఫారంతో కేసీఆర్, కేటీఆర్ బొమ్మలను పెట్టుకొని కారు గుర్తుపై గెలిచిన 10 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వ్యక్తిగత స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరి కోర్టు మొట్టికాయలతో పార్టీ మారలేదనడం సిగ్గుచేటన్నారు. దమ్ము ధైర్యం ఉంటే పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బై ఎలక్షన్‌లో నిలబడి గెలిచి చూపించాలని సవాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రోజే 10 నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యేలను తిరస్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎస్కే అఫ్రోజ్, బూత్‌కూరి శివరాజ్, కోడం వెంకటేశం, ముద్దం అనిల్‌గౌడ్, అందె సుదర్శన్, హరీష్, శ్రీనివాసరావు, జగన్, నరేష్, రాము పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ దేవాలయానికి మెట్ల నిర్మాణం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో కట్ట మైసమ్మ దేవాలయానికి యూత్ సభ్యులు రూ.లక్ష వ్యయంతో మెట్లు నిర్మించి ఆదర్శంగా నిలిచారు. దేవాలయానికి మెట్ల నిర్మాణం చేపట్టిన యువతను గ్రామపెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, నాయకుల పబ్బతి విజయేందర్‌రెడ్డి, కందుకూరి గణేష్‌గౌడ్, అబ్బాడి అనిల్‌రెడ్డి, కుల సంఘ పెద్దలు కపరవేని మల్లయ్య, కందుకూరి పర్శరంగౌడ్, చీకటి కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మనోజ్‌గౌడ్, కట్ట మైసమ్మ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఈనెల 22 నుంచి నిర్వహించనున్న శివకేశవుల కళ్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వాన పత్రం అందజేశారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ సర్పంచ్ భీమేశ్వర్, మాజీ ఎంపీటీసీ వసంత్‌కుమార్, సభ్యులు ఎల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి..
- ఎస్పీ మహేష్ బీ గితే



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- 18,208 కేసులు పరిష్కారం - రూ.3,06,77,036 చెల్లింపులు - జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్‌పర్సన్ పి.నీరజ అన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18,208 కేసులు పరిష్కరించగా రూ.3,06,77036 నష్ట పరిహారంగా చెల్లింపులు జరిగాయన్నారు. ఈ కేసుల్లో మోటార్ వాహన ప్రమాద కేసులు, 7సివిల్ తగాదాలు, 284 క్రిమినల్ కేసులు 18 ఎక్సైజ్ కేసులు 13 చెక్ బౌన్స్ కేసులు 11 కుటుంబ తగాదాలు, 80 సైబర్ క్రైం, 141 బ్యాంక్ కేసులు,25 బీఎస్ఎన్ఎల్, కేసులు, 2384 డ్రంకెన్ డ్రైవ్, 15239 ట్రాఫిక్ చాలన్ కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. కక్షిదారుల మధ్య రాజీ ఏర్పడితే సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సెషన్స్ జడ్జి పుష్పలత, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మేఘన, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజి భాస్కర్, ఆడెపు వేణు, ఆంజనేయులు పాల్గొన్నారు.

● వేములవాడ : రాజీమార్గం ద్వారానే చిన్నచిన్న సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని వేములవాడ సబ్ కోర్ట్ న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ అన్నారు. శనివారం వేములవాడ కోర్టులో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కక్షిదారులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలను కేసులు కోర్టుల వరకు తీసుకువచ్చి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధానకార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు తిరుమల్‌గౌడ్, అనిల్ కుమార్, ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం శీత కన్ను..

- బీజేపీ పాలిత ప్రాంతాల్లో యూరియా కొరత లేదు.. - కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని బీజేపీ పాలిత ప్రాంతాల్లో యూరియా కొరతలేదని, తెలంగాణ రాష్ట్రంపైనే కేంద్ర ప్రభుత్వం శీతకన్నేసిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కూతురు, కేటీఆర్ సోదరి కవితనే తమ కుటుంబం అవినీతికి ఆలవాలంగా మారిందని చెప్పిందన్నారు. అందినకాడల్లా హరీష్‌రావు, సంతోష్‌రావు దోచుకున్నారని నేరెళ్ల ఘటనకు కూడా సంతోష్‌రావు బాధ్యుడని కవిత చెప్పిందన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ, ఎన్‌జీవోలు, రాజకీయ విశ్లేషకులు చెప్పింది నేజమేనని కవిత మాటల ద్వారా తేటతెల్లమైందన్నారు. రెండవసారి అమెరికా వెళ్లివచ్చిన కవిత తన తుపాకు లను బావ హరీష్‌వైపు గురిపెట్టి నాన్నను, అన్నను వెనకేసు కొస్తూ డైవర్షన్ పొలిటికల్‌కు తెరలేపిందని ఆరోపించారు. నాన్న, అన్న ఎక్కడ జైళ్లకు వెళ్తారోనని కవిత కట్టుకథలు చెపుతూ బయటకు వచ్చిందన్నారు. కేటీఆర్, హరీష్ రావులు యూరియాపై తెలిసి తెలవన ట్లుగా మాట్లాడుతున్నారన్నారు. యూరియా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిది కాదని, కేంద్ర ప్రభుత్వం పరిధిలోనిదని పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన వారికి తెలియదా అని ప్రశ్నించారు. దేశంలోని బీజేపీ పాలిత ప్రాంతాలలో యూరియా కొరత లేదని తెలంగాణ రాష్ట్రంపైనే కేంద్ర ప్రభుత్వం శీతకన్నేసిందని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం దేశానికే ఒక దిక్సూచిగా మారిందని ఒక ట్రెండ్ సెట్టర్ చేస్తుందని బీఆర్‌ఎస్, బీజేపీ తట్టుకోలేకపోతుందని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేసి మీ కోటా ఇంతా మీ వాటా ఇంతా అని చేసి దేశానికే ఆదర్శప్రాయంగా నిలపడంతో బీజేపీకి వణుకు ప్రారంభమైందని అన్నారు. బీసీలం అని చెపుకునే బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీలకు అనుగుణంగా తీసుకొచ్చిన బీసీ రిజర్వేషన్ 42 శాతం చట్టరూపంగా తీసుకురావల్సి ఉండగా తొండీలు పెడుతున్నారని ఆరోపించారు. ముస్లింలు దేశ వ్యాప్తంగా కొంత భాగం బీసీలోనే ఉన్నారని అన్నారు. యూరియాను అవసరాలకు తగ్గట్టుగా యూరియాను సరఫరా చేయలేకపోతున్నామని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారన్నారు. అధికారంలో కోల్పోయిన వారు రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీలు యూరియా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, ముఖ్యమంత్రి కేంద్ర మంత్రులను కలిశారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు దాదాపు 21వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చిందన్నారు. 2009 నుంచి మొన్నటి వరకు కూడా సిరిసిల్లలో కూడా యూరియా కొరత ఉందని తాను నిరూపిస్తానన్నారు. యూరియాపై బీఆర్‌ఎస్ నాయకులను పంపించి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణకు సప్లయ్ చేయాల్సిన వాటా రాలేదని, వచ్చినా దానిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవ రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాసర్ల రాజు, దుబాల వెంకటేశం, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు రాగుల జగన్, ఆడెపు చంద్రకళ, కుడికాల రవికుమార్, ఆడెపు ప్రభాకర్, నాయకులు వైద్య శివప్రసాద్, బొద్దుల శ్రీనివాస్, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధతతో పనిచేసిన ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాగా శనివారం నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నేడు వసతులు మెరుగు అయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్ రెడ్డి, నాయకులు వెలిశాల జ్యోతి, మామిడి సంజీవ్, బొల్లవేని రమేష్, నీలం అంజయ్య, ముత్యం అమర్, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, శ్రీలతనరేందర్‌రెడ్డి, విజయలక్ష్మీమల్లేశం, యాస తిరుపతి, చిట్టి ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

కోనరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను అదనపు కలెక్టర్ నగేష్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్ రూమ్, తరగతి గదులను, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట కేజీబీవీ స్పెషల్ అధికారి ఇందిర ఉన్నారు.

టెట్ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి

వేములవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించి వచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాతిని రవి కోరారు. శనివారం వేములవాడలో జరిగిన ఎస్టీయూ టీఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెట్ అర్హత లేని అందరు ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించిందని, అయితే 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం దీని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కోర్టు తీర్పు ప్రస్తుత రూపంలో అమలు చేయబడితే సామూహిక పదవీ విరమణలకు తప్పనిసరి అవుతుందని, తెలంగాణ అంతటా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతకు కారణమవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రేవోజు సదానందం, ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి బొగ్గారపు నవీన్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర బాధ్యులు రవీందర్ రెడ్డి, యాదగిరి, పీఆర్సీ కమిటీ సభ్యుడు కందుకూరి దయానంద్, అసోసియేట్ అధ్యక్షుడు అరుకుటి మల్లేశం, రాష్ట్ర బాధ్యులు చాట్ల మల్లేశం, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా సదానందం

స్టేట్ టీచర్స్ యూనియన్ టీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రేవోజు సదానందం ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి తదితరుల సమక్షంలో శనివారం వేములవాడలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రేవోజు సదానందం, ప్రధాన కార్యదర్శిగా మొగిలి లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శిగా బొగ్గారపు నవీన్ ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను సంఘం సభ్యులు అభినందించారు.

ఆర్ కృష్ణయ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఉద్యమ నాయకుడు ఆర్ కృష్ణయ్యను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజాం కలిశారు. ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి యువకుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన వీరవేణి రాజ్‌కుమార్ (22) అనే యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్‌వాడకు చెందిన వీరవేణి రాజ్‌కుమార్ కమలా పూర్‌లోని ఫిల్టర్ బెడ్‌లో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి పనికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి వీరవేణి అమృత శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు రాజ్‌కుమార్ కోసం వెతుకుతుండగా మృతదేహం శనివారం ఉదయం వాగులో కనిపించింది. రాజ్‌కుమార్ తన విధుల్లో భాగంగా కమలాపూర్ చివరిలో గల ఫిల్టర్ బడ్ వద్దకు చేరుకునే క్రమంలో వాగులో ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


తాళ్ల కార్తీక్(ఫైల్)

గంగాధర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరర మండల కేంద్రానికి చెందిన తాళ్ల కార్తీక్ (19)యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం తాళ్ల కార్తీక్ కొంతకాలంగా మద్యానికి బానిసై తరుచు కుటుంబసభ్యుతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో గతంలో కుటుంబసభ్యులతో గొడవ పడి డిష్ వైర్‌తో ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈనెల 12న తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. రాత్రి అతిగా మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకుంటూ ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించాడు. రాత్రి అందరు ఎప్పటిలాగే పడుకుని తెల్లారి లేచి చూసే సరికి గదిలో మరణించి ఉన్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విచారణలో భాగంగా చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసర్ శేఖర్‌రావు, వైద్య బృందం గంగాధరలో ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దపాకలో ప్రమాదవశాత్తు గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గద్దపాక గ్రామానికి చెందిన నిమ్మరాజు రాజు (55) అనే వ్యక్తి ఈ నెల 9న రాత్రి నీళ్లు తాగడానికి లేచి నిద్రమత్తులో నీళ్లు తాగుతుండగా కాలు జారీ ఇంట్లో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతిడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో కానరాని క్రీడలు

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- అలనాటి క్రీడలు కనుమరుగు


కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అలనాడు ఆడిన ఆటలు పాఠశాలల్లో నేడు కానరావడం లేదు. గతంలో ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుకునే విద్యార్థులు 7నుంచి 10వ తరగతి వరకు పీఈ టీలు ఉండేవారు. ప్రైవేటు పాఠశా లలు లేని కారణంగా అందరూ ప్రభు త్వ పాఠశా లల్లోనే చదువుకునేవారు. దీంతో ఒక్కొక్క క్లాసులో వంద నుంచి 120మంది విద్యార్థుల వరకు ఉండేవారు. కాగా వారిని మూడు భాగాలుగా విభ జించి ఉపాధ్యాయులు క్లాసులు బోధించేవారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల సమయం నుంచి 5.30గంటల సమయం వరకు పీఈటీలు విద్యార్థులకు ఆటలు ఆడించేవారు. గతంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, అథ్లెటిక్స్, జావెల్‌త్రో, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు పీఈటీలు ఆడించేవారు. ఆటల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఆడించిన సంఘటనలు ఉన్నాయి. గ త ం లో ఉపా ధ్యాయులు స్థానికంగా ఉం డటం ఒక కారణమైతే, పాఠశాలకు సమయాని కంటే ఒక గంట ముందే వచ్చేవారు. అలాగే పాఠశాల అయిపోగానే విద్యార్థులతో కలిసి సాయంత్రం ఆటలు ఆడేవారు. ప్రస్తుతం ఉపాధ్యా యులు సుదూర ప్రాంతా లైన హనుమకొండ, కరీం నగర్, పెద్దపల్లి, జమ్మి కుంట తదితర పట్టణాలనుంచి వస్తూ, హడావుడిగా వెళ్లిపోతున్నారు. గతంలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలుక్రీడలు ఆడేవారు. మండల కేంద్రంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన పీఈటీ సంపత్ కుమార్, షైన య్య, ఇంద్ర సేనారెడ్డి, కూనారంలో రాజ నర్సులు ఇలా పలువురు వ్యాయా మ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటలు నేర్పించి, ఆ విద్యార్థులను జాతీ య స్థాయి క్రీడల్లో ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు పలువురు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ కొలువుల్లో పని చేస్తున్నారు. మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నా కేవలం ఆ పాఠశాలల్లో 312 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఏడు వరకు ఉన్న 34ప్రభుత్వ పాఠశాలల్లో 1147మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే 179మంది ఉపాధ్యాయులు మండ లంలోని ఆయా పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారు. కాల్వ శ్రీరాంపూర్, పెగడపల్లిలో ఇద్దరు పీఈ టీలు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విద్యార్థులు సాయంత్రం 3గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో విద్యాబోధన, అనంతరం ఆ తదుపరి ఆటలు ఆడటం వల్ల మానసికంగా విద్యతోపాటు శారీరక శ్రమ అలసటతో విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేవారు. గతం లాగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు విద్యార్థులకు వారి ఇష్టమైన ఆటలు ఆడించేలా మైదా నంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల ప్రజలు తమ అభిప్రాయలను వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్రస్థాయిలో ఖోఖో ఎన్నోసార్లు ఆడాను..



- సబ్బని శ్రీనివాస్, పూర్వవిద్యార్థి, పెగడపల్లి

కాల్వశ్రీరాంపూర్ ఉన్నతపాఠశాలలో తాను 1982లో 10వతరగతి వరకు చదువుకున్నాను. చదువుతోపాటు ఆటలు ఆడుకునేవాళ్లం. ఖోఖోలో రాష్ట్రస్థాయిలో ఆడాను. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ క్రీడలు కానరావడం లేదు.

జాతీయ స్థాయిలో కబడ్డీ ఆడాను..



- అల్లం దేవెందర్, పూర్వవిద్యార్థి, కాల్వశ్రీరాంపూర్

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999లో 10వ తరగతి వరకు చదువుకున్నా. నేను కబడ్డీలో జాతీయస్థాయిలో ఎంపికై ఢిల్లీలో కూడా కబడ్డీ ఆడాను. తాము చదువుకునే సమయంలో గ్రామీణ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఉండేది. ప్రస్తుతం పాఠశాలల్లో ఆటలు కానరావడం లేదు.

పురుగుల మందు డబ్బాతో వ్యక్తి ఆందోళన

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దాసరి సదానందం అనే వ్యక్తి ఆస్తిలో వాటా డబ్బులు ఇవ్వకుండా సోదరులు తనని ఇబ్బంది పెడుతున్నారని శనివారం పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సదానందంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరులు ఉమ్మడి ఆస్తి విక్రయించగా తనకు ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలన్నారు. తన కూతురు వివాహం ఉన్నందున డబ్బులు ఇవ్వమంటే తన అన్నదమ్ములు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో తాను ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గూడూరి మనోహర్‌పై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈనెల 12న అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని మనోహర్‌కు 14 రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

యువకులకు గంజాయి పరీక్షలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని పలు ఇళ్లలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు శనివారం సోదాలు నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇద్దరు అనుమానిత యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రాపిడ్ పరీక్షలు నిర్వహించామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఖాతాలో నుంచి రూ.70 వేలు మాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరస్థులు అదును దొరికితే చాలు.. అమాయకుల ఖాతాల్లోంచి డబ్బులను క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఓ వ్యక్తి ఇటీవల ఏఐ ట్రెండ్‌తో వచ్చిన యాప్‌లో తన ఫోటోను అప్‌లోడు చేశాడు. ఆ క్రమంలో సదరు వ్యక్తి సెల్‌ఫోనుకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేయడంతో సైబర్ నేరస్థులు ఆయన ఖాతాలో నుంచి రూ.70వేలను మాయం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నారు.

తాళం పగలగొట్టి.. పట్ట పగలే చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి పట్ట పగలే చోరీ చేసిన సంఘటన శనివారం శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి గ్రామానికి చెందిన బియ్యాల కృష్ణ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వ్యక్తిగత అవసరాల నిమిత్తం కరీంనగర్ వెళ్లగా, కుటుంబ సభ్యులు అదే గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంటర్నెట్ షాపు నిర్వహణకు ఉపయోగించే లాప్‌టాప్, ఇన్వెర్టర్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. వాటి విలువ సుమారు 30వేల రూపాయల వరకు ఉంటుందని, చోరీపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. కాగా గ్రామంలోని మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు సమాచారం.

గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు

- అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వండి - గోదావరిఖని ఏసీపీ మడక రమేష్


కాలనీవాసులతో మాట్లాడుతున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని గోదావరిఖని ఏసీపీ మడక రమేష్ హెచ్చరించారు. గోదావరిఖని రాంనగర్, సీతానగర్, కృష్ణనగర్, లెనిన్‌నగర్, 2ఏ మోరీ, ఆర్‌సీఓఏ క్లబ్ ప్రాంతంలో శనివారం ఏకకాలంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను సోదా చేయడంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే కూలీలు ఎక్కువ మంది నివసిస్తున్నారని, వారికి కిరాయి ఇళ్లు ఇచ్చే వారు వారి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. యువత గంజాయికి బానిసలవుతున్నారని, గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మైనర్లకు మోటార్‌సైకిల్ ఇవ్వవద్దని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేసి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. తనిఖీల్లో గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, ఎస్‌ఐలు రమేష్, భూమేష్, అనూష, నవీన్, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్ల సతీష్ కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడు నెలల్లో మూడింతలు డబ్బులు వస్తాయని పలువురి వద్ద కోటి రూపాయలకుపైగా వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో గురువారం నమోదైన కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్ల సతీష్‌ను పోలీసు కస్టడీకి అనుమతించాలంటూ కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో కట్ల సతీష్‌ను శుక్రవారం అరెస్టు చేసి జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు నిందితుల్లో మరో ఇద్దరు పరారీలో ఉండగా ఇద్దరిని ఇప్పటికే సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే క్రిప్టో కరెన్సీ మెటాఫండ్ పేరిట ఫేక్ ఐడీలు సృష్టించి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు బాధితులు కరీంనగర్ రెండో ఠాణా, కరీంనగర్ రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి మరింత లోతుగా విచారణ చేయాల్సి ఉందని, నిందితుడు కట్ల సతీష్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి అనుమతి ఇవ్వాలని పోలీసులు పిటీషన్ దాఖలు చేశారు. ఫేక్ క్రిప్టో కరెన్సీ దందాలో వ్యాపారులు, సామాన్య ప్రజలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులుకూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 100 కోట్లపైగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో కస్టడీకి తీసుకుని పెట్టుబడిపెట్టిన వ్యక్తుల వివరాలు తెలుసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత


బోయినపల్లిలో పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

బోయినపల్లి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఒక పాత ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు వెంటనే అక్కడికి వెళ్లి కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దగంటి అంజయ్యను పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీణవంక: మండల కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్నారన్నా సమాచారం మేరకు లోకిని స్వామి ఇంటిపై పోలీసులు దాడి చేయగా 12 బస్తాల బియ్యం బస్తాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. దాదపు ఐదు క్వింటాళ్ల బియ్యం అక్రమ రవాణకు సిద్ధంగా ఉండడంతో వాటిని పట్టుకొని లోకిని స్వామిపై కేసు నమెదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని గొల్లపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను శనివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇటుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి శనివారం బోల్తా పడింది. గ్రామస్థుల సమాచారం మేరకు మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామం నుంచి ఇటుకను ట్రాక్టర్‌లో శంకరపట్నం మండలం ధర్మారంలో ఇంటి నిర్మాణానికి తరలిస్తున్నారు. ధర్మారం గ్రామ శివారులో భారీ వర్షాలతో రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయలు కాలేదు.

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

- వారం వ్యవధిలో మూడు ఆలయాల్లో చోరీ


గోపాల్‌రావుపేట గుడిలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన నిందితులు

ధర్మారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల వ్యవధిలో మూడు దేవాలయాల్లో వరుస దొంగతనాలు జరిగిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి నందిమేడారంలోని అమరేశ్వరస్వామి దేవాలంలోకి చొరబడిన దొంగలు గుడి తాళాలు పగుల గొట్టి హుండీ ఎత్తుకెల్లారు. గుడిచెర్మన్ పోలీసులకు ఇచ్చిన సమాచారంతో కానిస్టేబుల్ రాజు ఆలాయానికి వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈనెల ఏడో తేదీన ఆదివారం రాత్రి గోపాల్‌రావుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా దొంగలు పడి హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. దీనితో పాటు 10న, బుధవారం రాత్రి మేడారం ఎస్సీ కాలనీలో మేన్‌రోడ్‌కు ఆనుకొని ఉన్న హనుమాన్ టెంపులో కూడా దొంగలు హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లినట్లు సమాచారం. ఇన్ని వరుస సంఘటనలు జరుగుతున్నప్పటికీ ఆయా గ్రామాల్లోని ప్రజలకు కూడా గుడిలో దొంగలుపడినట్లు తెలియపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


వెల్గటూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ధర్మారం మండలం మేడారం, కటికెనపల్లికి చెందిన వెంకటేష్, సంతోష్, మల్లేష్ అనే యువకులు ద్విచక్రవాహనంపై వెల్గటూర్ వైపు నుంచి ధర్మారం వైపు వెళ్తుండగా అదుపు తప్పిపడిపోయింది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

జీడీకే 11 ఇంక్లైన్ బొగ్గుబాయిపై దొంగతనం

- రూ.10 లక్షల సామగ్రి అపహరణ
- ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు?

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం జీడీకే 2ఇంక్లైన్‌లో దొంగలు పడ్డ సంఘటన మరువక ముందే ఇదే ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే ఇంక్లైన్‌లో భారీ దొంగతనం జరిగింది. గనిలోని లాంగ్‌వాల్ షెడ్‌లో చోరీ జరిగినట్లు రెండు రోజుల క్రితం అధికారులు గుర్తించారు. దీంతో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. 11ఇంక్లైన్ లాంగ్ వాల్‌షెడ్ స్టోర్‌లో పైకప్పు రేకులు తొలగించి లోపలికి చొరబడిన దొంగలు విలువైన కాపర్ కేబుళ్లు, విలువైన ఇత్తడి సామగ్రిని దొంగించినట్లు అధికారులు గుర్తించారు. దొంగిలించిన సామగ్రి విలువ రూ.10లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.


జీడీకే 11ఇంక్లైన్ స్టోర్ పైకప్పు రేకులు పగుల గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

తెగిపోయిన ఇందుర్తి ఎల్లమ్మ వాగు రోడ్డు

- పట్టించుకోని అధికారులు - మరమ్మతులు చేసిన ప్రయాణికులు


తెగిన రోడ్డును మర్మత్తు చేస్తున్న ప్రయాణికులు


రోడ్డు తెగిపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

చిగురుమామిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి ఎల్లమ్మ వాగు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కోహెడ-చిగురుమామిడి మండలాల ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి. అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు స్వయంగా శ్రమదానం చేసి రోడ్డును మరమ్మతు చేశారు. ఇదే సందర్భంలో అక్కడికి వచ్చిన ఆర్టీసీ బస్సు రోడ్డు దెబ్బతినడంతో బస్సు వెనుదిరిగి వెళ్లిపోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్ఎండీలో మత్స్యకారుడి వలకు చిక్కిన 'సిల్వర్ ఫిష్'



తిమ్మాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు మండలంలోని దిగువ మానేరు జలాశయంలోకి వెళ్లిన మత్స్యకారుడి వలకు ఓ అరుదైన చేప చిక్కింది. మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోళ్ల భూమయ్య అనే మత్స్యకారుడు చేపలు పట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రోజు వారిలోగే శనివారం ఉదయం కూడా చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వల వేయగా 20 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సిల్వర్ ఫిష్‌గా పిలుస్తారని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇది చైనాకు చెందిన జాతి అని చైనా నుంచి తీసుకువచ్చి మన దేశంలో పెంచుతున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల్లో నాలుగు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ చేపల్లో ముళ్లు అధికంగా ఉంటాయన్నారు. వర్షాలతో, వరదల కారణంగా ఎగువ నుంచి ఈ చేప ఎల్ఎండీలోకి వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇది ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంటుందని మరికొందరు చెబుతున్నారు.

బాలికను వేధించిన వ్యక్తి రిమాండ్

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన వ్యక్తికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంబాలాపూర్ గ్రామానికి చెందిన రావనవేణి హరీష్ ఓ బాలిక వెంబడించి వేధించాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాగా పోలీసులు రావనవేణి హరీష్‌ను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.



- కరీంనగర్, రామగుండంలో ఏర్పాటుకు అనుమతి
- కరీంనగర్ ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 25న చివరి గడువు

ద్వితీయశ్రేణి నగరాల్లో మైక్రో బ్రూవరీలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీరు ప్రియులకు కిక్కిచ్చే మైక్రో బ్రూవరీలు ఇక ద్వితీయశ్రేణి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. బీర్లు కొనుగోలు చేయాలంటే ఇక నుంచి వైన్‌షాపుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని వంటి పెద్ద పట్టణాలకే పరిమితమైన మైక్రో బ్రూవరీ యూనిట్లను ద్వితీయశ్రేణి నగరాలు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) కరీంనగర్, రామగుండం వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మైక్రో బ్రూవరీలను ఏర్పాటు చేసుకుని, వ్యాపారం కొనసాగించుకునేందుకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లను జారీ చేయనున్నది. కరీంనగర్, రామగుండంలో మైక్రో బ్రూవరీ యూనిట్లు ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాత్రమే 18 వరకు మైక్రో బ్రూవరీలు నడుస్తున్నాయి. ఇప్పుడు కరీంనగర్, రామగుండంతో పాటు మరికొన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌లలు, ఎలైట్ బార్‌లు, క్లబ్‌ల వంటి ఇదివరకే లైసెన్స్ కలిగిన ప్రాంగణాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త స్థలాల్లోనూ నిబంధనల మేరకు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది.

● విధి విధానాలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లలో మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని ఆసక్తి ఉన్న ఔత్సాహికులు దరఖాస్తుతోపాటు లక్ష రూపాయల చలానా, ఆధార్, హోటల్/రెస్టారెంట్/బార్/క్లబ్‌లకు సంబంధించిన జిరాక్స్ కాపీలు జత చేసి దరఖాస్తు కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. హోటళ్లు, రెస్టారెంట్లు వంటివి లేని వారు కొత్తగా మైక్రోబ్రూవరీ యూనిట్ ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి సమర్పించే లక్ష రూపాయల చలాన్ నాన్ రిఫండబుల్‌గా ఉంటుంది. అంటే దరఖాస్తు ఫీజుగా పరిగణిస్తారు. దరఖాస్తులకు, మైక్రో బ్రూవరీలకు పరిమితి లేదు. ఎన్ని కావాలంటే అన్ని యూనిట్లకు ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లు జారీ చేసేందుకు సిద్ధంగా ఉంది. లైసెన్స్ తీసుకున్న తరువాత మైక్రో బ్రూవరీ యూనిట్ ఊర్పాటుకు 180 రోజుల వ్యవధి నిర్ధేశించారు. ఈ వ్యవధిలో యూనిట్ ఏర్పాటు చేసుకోనట్లయితే లైసెన్స్ గడువు ముగిసి రద్దు అవుతుంది. వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. 100 చదరపు మీటర్లలో రెస్టారెంట్, 300 చదరపు మీటర్లలో మైక్రోబ్రూవరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. మిగతా స్థలంలో కిచెన్, లాయిలెట్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 250 చదరపు మీటర్లలో పార్కింగ్ స్థలం ఉండాలి. రెస్టారెంట్‌లో ఎయిర్ కండిషన్, ఎయిర్ కూలింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఏడాదికి ఐదు లక్షల ఫీజు చెల్లించాల్సి ఉండగా, కోటి రూపాయలపైగా ఖర్చు అయ్యే మైక్రోబ్రూవరీ యూనిట్ మాత్రం లైసెన్స్‌దారుడే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మైక్రో బ్రూవరీలో తయారు చేసిన బీరును అక్కడే విక్రయించాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల్లో బయట అమ్మేందుకు వీల్లేదు. కాల వ్యవధిలోపు విక్రయం జరగకుంటే ఆ బీరును పారబోయాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రూవరీల ఏర్పాటు కోసం ఈ నెల 2న నోటిఫికేషన్ జారీకాగా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ధర్మపురి లక్ష్మీనరసింహా స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు అంజనేయస్వామి చుట్టు ప్రదక్షిణలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్దలతో పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారలకు అభిషేకాది పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వ ర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథ శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి అర్చకులు అభిషేకం, నిత్య పూజలు నిర్వహించారు. సినీ నటుడు రాజేశ్ శనివారం అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

'యాత్రాదానం'లో భాగస్వాములు కావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రాదానం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ దేవాలయాలకు పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకు వెళ్లవచ్చన్నారు. సమాజ హితానికి ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోలు యాత్రాదానం కార్యక్రమంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందిస్తున్న ఆర్టీసీ యాత్రాదానం కింద బస్సుల బుకింగ్ కోసం స్థానిక ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించాలన్నారు. ఆర్టీసీ హెల్ప్‌లైన్ నంబర్లు 04069440000, 04023450033కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆర్టీసీ అధికారులు యాత్రాదానం టూర్ ప్యాకేజీల వివరాలను అందిస్తారన్నారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా దైవదర్శనం, విహారయాత్రకు యాత్రాదదానం చేయాలని కోరారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు అశోక్‌కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన గుగులోత్ అశోక్ కుమార్ ఎంపికయ్యారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ ఆధ్వర్యంలో జరగనున్న మొదటి అంతర్జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయన గతంలో కరీంనగర్‌లో రెజ్లింగ్ కోచ్‌గా, డీవైఎస్‌వోగా విధులు నిర్వహించారు. ఓ రెజ్లింగ్ క్రీడాకారుడిపై ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రీసెర్చ్ చేస్తున్న సందర్భంగా అశోక్‌కు వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సులో పాల్గొననున్నారు. క్రీడారంగంలో విశిష్ట సేవలందించి రాబోయే తరానికి అశోక్‌కుమార్ ఒక స్ఫూర్తిగా ఉండాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి అయనను అభినందించారు.

కొండగట్టుకు రావాలని చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి రావాలని ఆలయ అధికారులు, అర్చక బృందం త్రిదండి చిన్నజీయర్‌స్వామిని కోరారు. హైదరాబాద్ ముచ్చింతల్‌లో గల సమతమూర్తి ఆశ్రమంలో కలిసి కొండగట్టులో నిర్వహించనున్న వేడుకలకు రావాలని ఆహ్వానించారు. జీయర్‌స్వామిని కలిసిన వారిలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, అర్చకులు తదితరులు ఉన్నారు.

అంజన్న సన్నిధిలో 'కార్పం' సినిమా బృందం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న నూతన సినిమా కార్పం చిత్రబృందం శనివారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకుంది. చిత్రం స్క్రిప్ట్‌తో స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిత్రబృందంను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బృందసభ్యులు మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషతో ఇక్కడి సంప్రదాయలను ఈ సినిమాతో తెరకెక్కించనున్నట్లు తెలిపారు. కొండగట్టు ప్రాంతంలో సినిమా షూటింగ్ ఉంటుందని తెలిపారు.

కూతరు అపాయంలో ఉందంటూ సైబర్ నేరస్థుల ఫోన్

● అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మీ కూతురు ఓ కేసులో ఇరుక్కుంది.. డబ్బులు పంపించాలని ఆనడంతో అప్రమత్తమైన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన హుజూరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణానికి చెందిన నుస్రత్ కూతురు ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్ చదువుతోంది. ఓ పోలీస్ అధికారి డీపీతో సైబర్ నేరగాళ్లు నుస్రత్‌కు ఫోన్ చేసి మీ కూతురు ఓ కేసులో ఇరక్కుందని, రూ. 30 వేలు ఫోన్ పే ద్వారా చెల్లిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. అప్రమత్తమైన సదరు మహిళ కళాశాలకు వెళ్లి కూతురును కలిసింది. ఈ విషయాన్ని తన భర్తకు తెలపడంతో సైబర్ నేరగాళ్ల పని అని పోలీస్‌స్టేషన్లో టౌన్ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కిరాణాషాపులో చోరీ

బీర్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీర్‌పూర్ మండలం తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన నల్ల మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి కిరాణం షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. దుండగులు షాపు తాళం పగులకొట్టి కౌంటర్‌లోని నలభై వేల రూపాయలు, అర్ధ తులం బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని జీవన్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన జీవన్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళుతున్నాడో, ఏ పని చేస్తాడో తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో శనివారం ఒక ఇంటిపై దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 21,400 రూపాయలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

- 22 గేట్ల ద్వారా దిగువకు 1,14,680 క్యూసెక్కులు నీరు

జగిత్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. శనివారం 22 గేట్లు ఎత్తి 1,14,680 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,32,395 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.



గోదావరిలోకి పరుగులు పెడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరు

253విఎండి13: మిడ్ మానేరు ప్రాజెక్టు

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) శనివారం 10,600 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9800, మానేరు ములవాగు ద్వారా 800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400, ప్యాకేజి 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.80 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.042 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● అన్నపూర్ణ రిజర్వాయర్‌లో..

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.04టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6,400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో..

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎల్ఎండీ రెండు గేట్ల ద్వారా 8,309 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు 10,314 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయి. ఎల్ఎండీ రెండు గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుఉలు, కాకతీయ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో వెళ్తోందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే





పనులను పరిశీలిస్తున్న ఎస్పీ, సినీనటుడు రాజేశ్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధమైన శ్రీభీమేశ్వరాలయానికి వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మహేష్ బిగితే అన్నారు. భీమేశ్వరాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో క్యూలైన్స్, వీఐపీ దర్శనం, కోడెమొక్కుల దర్శనం, వీఐపీ రోడ్డు, పార్కింగ్‌స్థలాలు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, టాఫిక్ ఆర్ఎస్ఐ రాజు, ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఏఈ నాగరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎస్పీ పూజలు

భీమేశ్వరాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎస్పీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న సినీనటుడు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని సినీ నటుడు రాజేష్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి రాజన్నప్రసాదం అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం

జమ్మికుంట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూమిలినియం పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ బెస్ట్ అబైలబుల్ పాఠశాల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. కొన్నిసంవత్సరాలుగా పాఠశాలల కు రావల్సిన బాకాయిలు పెండింగ్ అంశాలపై చర్చించారు. ఇంటర్ మీడియ ట్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల వలే పాఠశాలల యజమాన్యాలు సైతం సహాయ నిరాకరణ బాటలో పయనించాలని నిర్ణయించారు. ముఖ్య అతిథిగా ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పాల్గొని మాట్లాడుతూ 18వ తేదీలోపు బకాయిలు చెల్లించని పక్షంలో తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు మునిపట్ల తిరుపతిరెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు పూల్లూరి సంపత్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రైవేటు స్కూల్ యజమానులు

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులపై జీఎం అసంతృప్తి

పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నత్తనడకన జరుగుతున్న అమృత్ స్టేషన్ ఆధునికీకరణ పనులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన మంచిర్యాల, రామగుండం రైల్వేస్టేషన్లను పరిశీలించిన అనంతరం డీఆర్ఎం రాధాకృష్ణతో కలిసి పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడ 22కోట్ల రూపాయలతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. పనుల్లో ఏమాత్రం వేగం పుంజుకోవడం లేదు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను జీఎం ప్రశ్నించారు. పనుల్లో వేగం పెరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పూర్తి చేసి ప్రయాణికులకు స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ మెంబర్ ఎన్‌డీ తివారి జీఎంకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఇక్కడ వివిధ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని తివారితోపాటు విష్ణు ప్రకాశ్, మాలని, దీపరాం, పూరారామ్, పన్నాలాల్, నైన్ సింగ్ తదితరులు జీఎంను కోరారు.

రామగుండం రైల్వేస్టేషన్ సందర్శించిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

అంతర్గాం: రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను శనివారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, పార్కు, పార్కింగ్ స్టాండ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే రైల్వేసంస్థ ప్రధానలక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుందనపల్లి, పెద్దంపెట్, కన్నాల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరుతూ రైల్వేబోర్డు మెంబర్ అనుమాస శ్రీనివాస్ జీన్స్ పలు కార్మిక సమస్యలు పరిష్కరించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే సంఘ్ యూనియన్ నాయకులు జీఎంకు వినతిపత్రాలు అందజేశా రు. అనంతరం జీఎం రైల్వే అధికారులతో కలిసి గోదావరిఖనిలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, రైల్వే సైడింగ్‌లను తనిఖీచేశారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వేమేనేజర్ గోపాల్‌కృష్ణన్, స్టేషన్‌మాస్టర్ మీనా, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారాయణ, రవికుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ లింగమయ్య, యూనియన్ నాయకులు యాదగిరి స్వామి, రాథోడ్ ఆనంద్, అజ్మీరా వీరన్న తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో పనుల మ్యాపులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

తెల్లవారక ముందే పల్లె లేస్తోంది..



రుద్రంగి మండలం మానాలలో రైతులు క్యూ

(5వ పేజీ తరువాయి)

వద్ద సింగిల్ విండో, గ్రోమోర్ కేంద్రాల వద్ద టోకెన్ల కోసం తెల్లవారుజాము మూడు గంటల నుంచి రైతులు క్యూ కట్టారు. ఇల్లంతకుంటలో ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాలు కావాలంటే సేంద్రియ ఎరువులు కొనాలని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముస్తాబాద్‌లో గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు బారులు తీరారు. కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో యూరియా కోసం రైతులు ఆందోళన పడుతున్న తీరు రోజురోజుకు పెరుగుతుండటంతో వ్యవసాయ శాఖ టోకెన్ల విధానం అమలు చేస్తున్నా యూరియా సరఫరా లేకపోవడంతో ఇబ్బందికరంగానే ఉంది.

● పంటలకు శ్వాస.. రైతుల ప్రయాస..

వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా కొరత కన్నీళ్లను తెప్పిస్తోంది. పంటకాలం అదను దాటిపోతుందని ఆందోళన చెబుతున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేసుకున్న పంట యూరియా లేక దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు కురుస్తున్న వర్షాల వల్ల కలుపు, చీడపీడల సమస్యలతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వరి ఎదుగుదల లోపిస్తోందని ఆందోళన చెందుతున్నారు. కీలకమైన దశలో యూరియా లేక రైతులు అవస్థలుపడుతున్నారు. జిల్లాలో 241227 ఎకరాల్లో వివిధ పంటలు చేశారు. ఇందులో వరిసాగు 185420ఎకరాలు, పత్తి 46385ఎకరాలు, మొక్కజొన్న 3758 ఎకరాలు, కందులు 668 ఎకరాలు, పెసర 30, పచ్చి రొట్టె 4500 ఎకరాల్లో సాగు చేశారు.

బద్దం ఎల్లారెడ్డికి ఘన నివాళులు



గాలిపల్లిలో బద్దం ఎల్లారెడ్డి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధపోరాటవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వారోత్సవాలలో భాగంగా శనివారం గాలిపెల్లి గ్రామంలోని బద్దం ఎల్లారెడ్డి స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు నిజంసైనిక తొత్తులైన పెత్తందార్లకు తెలంగాణ ప్రజలకు మధ్య జరిగిన పోరాటాన్ని కొంత మంది కావాలని హిందుముస్లింల మధ్య జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాట నిర్మాణంలో ఒక్కరైన గాలిపల్లి గ్రామానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ప్రజలను చైతన్యవంతులను చేశారని, అనేక రోజులు జైలుజీవితం గడిపారని పేర్కొన్నారు. సాయుధపోరాటంతో దాదాపు 4వేల మంది అమరులయ్యారని, లక్షలాది ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీచేయడం జరిగిందన్నారు. నేటి తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ, జవ్వాజి విమల, జిల్లాకమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, సూరం పద్మ, ముక్తికాంతా అశోక్, గురుజాల శ్రీధర్, సావనపెల్లి రాములు, గరిగె రవి, బిక్షపతి, సామ నర్సింహ్మరెడ్డి, అశోక్, సావనపెల్లి ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చందుర్తి, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో సేంద్రియ ఎరువుల తయారీపై శనివారం మహాత్మ జ్యోతి బాపూలే వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ట్రైకొడర్మా విరిడే అనే జీవశిలేంద్ర నాశిని సామూహిక ఉత్పత్తిపై ఆచరణాత్మక ప్రదర్శనచేశారు. ఎండు తెగుళ్ళు, వేరుతెగుళ్ళు వంటి నేల ద్వారా వ్యాపించే ఫంగల్ వ్యాధులను ట్రైకొడర్మా నివారించి పంట దిగుబడిని, నాణ్యతను పెంచుతుందన్నారు. మొక్కల ఎదుగుదలను ప్రోత్సాహించడమే కాకుండా రోగానిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కూరగాయలు, పప్పు ధాన్యాలు, పండ్లు, వంటి అనేక రకాల పంటల్లో విత్తన శుద్ధి చేసుకోవచ్చున్నారు. పర్యావారణానికి ఎటువంటి హాని కలగదని, నెలలో ఉపయోగకరమైన సూక్ష్మ జీవుల సంఖ్య పెరుగుతయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సరిత, వసంత, అశ్విత, హేమశత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల మృతిచెందిన మారుపాక బాల ఎల్లయ్య, ఈరవేణి రమ్య కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు శనివారం పరామర్శించారు. పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్న బాల ఎల్లయ్య కుటుంబానికి నాయకులు చల్ల పద్మారెడ్డి 25 కిలోలు, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి 25 కిలోలు, రూ.వేయి నగదు, కొండాపురం బాల్‌రెడ్డి 50 కిలోలు, కొంగరి కిష్టారెడ్డి 25 కిలోల బియ్యం అందజేశారు. ఈరవేణి రమ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముగ్గురు పిల్లల పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఆయన పిల్లలను చదివించేందుకు ప్రభుత్వం పక్షాన కృషి చేస్తామని హామీ ఇచ్చారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, సత్యం, బాల పోచయ్య, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు శనివారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముసుకు మల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి సింగారం తిరుపతి తెలిపారు. 2009 సెప్టెంబరు 31వ తేది తరువాత జన్మించి 16సంవత్సరాలలోపు ఉండి 55 కేజీలోపు ఉన్న బాలబాలికలు మాత్రమే ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు అర్హులైన బాలబాలికలు తమ ఒరిజనల్ ఆధార్ కార్డు, పదో తరగతి మెమోతో పాల్గొన్నాలన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 25న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పంపిస్తామని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి

- ప్రజా ప్రభుత్వ పనితీరు నచ్చడంతోనే కాంగ్రెస్‌లో చేరికలు.. - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోనరావుపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కోనరావుపేట మండల ప్రాథమిక వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ అబ్బాసాని శంకర్ గౌడ్, మర్రిమడ్ల తాజా మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, కొలనూరు ప్యాక్స్ డైరెక్టర్ ఇప్ప రాములు, మాజీ వార్డు సభ్యులు శంకరవ్వ, బొడ్డు కిషన్‌లతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం వేములవాడలో ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవంతో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలని కోరారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాణ్యతలేని నిర్మాణాలతో రాష్ట్ర అభివృద్ధిని ధ్వంసం చేసిందని, పేదలకు సంక్షేమ పథకాలు కూడా అందించలేకపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్, పది లక్షల రూపాయల మేరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండ నర్సయ్య యాదవ్, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదిన వేడులను ఈనెల 17న ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈనెల17న చేపట్టే కార్యక్రమాలు, కార్యాచరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, బీజెవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి జుకంటి అఖిల్, జిల్లా కోశాధికారి ఆనాని లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, నాయకులు కోసిని వినయ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, కోడం భవిత, ఇటికల మహేందర్, కర్నె గణేశ్, కరెండ్ల రవీందర్‌రెడ్డి, బోల్గం భాస్కర్, బక్కశెట్టి రాజేందర్, అమరగొండ రాజు, గోనపెల్లి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, కందుకూరి మహేశ్, జిందం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సంతోష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఈనెల17న తెలంగాణ విమోచన దినం, ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఈనెల 18న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు పాల్గొని పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణహరి, ప్రకాశ్, బాలకృష్ణ, గణేశ్, నరేశ్, లక్ష్మణ్, మహేశ్, గాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీశైలం, కుమార్, కిరణ్‌నాయక్, రవీందర్, రంజిత్, శ్రీకాంత్‌రెడ్డి, వేణు, పర్శరాంరెడ్డి, గణేశ్‌నాయక్, నవీన్, అబ్దుల్, నర్సయ్య, మహేందర్, రాకేశ్ పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలంలోన బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అన్నారు. వేములవాడ మండలంలోని కొడుముంజ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లాడి రమేష్, లింగంపల్లి శంకర్, చింతపల్లి మోహన్‌రావు, జింక అనిల్, గుండెకొర్ల లక్ష్మణ్ సంతోష్‌యాదవ్, రేగుల పర్శరాములు తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సేవా పక్షం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో జరిపించాలని కోరారు. ఈనెల 17న నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలో నిర్వహించే రక్తదాన కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నాయకులు పల్లం అన్నపూర్ణ, జయశ్రీ, సురేష్ గౌడ్, మధు, శ్రీనివాస్, తిరుపతి, అనిల్, సుధాకర్, పరుశురాం, జలంధర్, వెంకటి, మోహన్, జితేందర్ రెడ్డి, రవి, నాగరాజు, కిషన్, కృష్ణస్వామి, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలతో పాటు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య అన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం, ప్రధాన కార్యదర్శి, సిరికొండ శ్రీనివాస్, కౌన్సిల్ మెంబర్ పోశెట్టి రాకేష్, నాయకులు పెరుక గంగరాజు, మర్రి మల్లేశం, చిర్రం తిరుపతి, చింతకుంట సాగర్, లోకోజి సతీష్, గడిగొప్పుల జీవన్, చిలుమల హన్మయ్య చారి, చింతకుంట గంగాధర్, ఎగుమంటి శ్రీనివాస్‌రెడ్డి, బంధం తిరుమల్ రెడ్డి, మోత్కుపల్లి రాజశేఖర్, బోరుగాయ తిరుపతి, గోన్కుల కమలాకర్, ఎల్లాల తిరుపతిరెడ్డి, పాటి సుధాకర్, దుర్శెట్టి రాజు, కోటయ్య, పకిడే శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు



వీర్నపల్లిలో రైతుల పడిగాపులు



వేములవాడ పట్టణంలో వేచి ఉన్న రైతులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు రాచర్లగుండారం గ్రామాల్లోని గ్రోమోర్ ఎరువుల దుకాణం, గోదాంల వద్ద రైతులు యూరియా కోసం శనివారం బారులు తీరారు. రైతుల నడుమ తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసుల పహారాలో పంపిణీ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని గ్రోమోర్ దుకాణం నిర్వాహకులు ఒక్కో బస్తాకు రూ.300 వసూలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులను నిలదీయడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఒక బస్తాను అందించారు.

● వేములవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. వేములవాడ పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో యూరియా అందుబాటులో ఉందని అందిన సమాచారంతో శనివారం తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి యూరియా బస్తాల కోసం చెప్పులను క్యూలైన్ లలో పెట్టారు. రైతులు గంటలకు పైగా నిరీక్షించిన అనంతరం పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న యూరియా కారణంగా 300 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున యూరియాను సరఫరా చేశారు. యూరియా కోసం తెల్లవారుజామునే వేములవాడకు వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● కోనరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు పడికాపులు కాస్తున్నారు. అయినా రైతులకు యూరియా బస్తాలు దొరకకపోవడంతో కొంతమంది రైతులు వెనుదిరుగుతున్నారు. కోనరావుపేట మండలంలోని మరిమడ్ల సింగిల్‌విండో గోదాంలో యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారని తెలుసుకొని రైతులు బారులు తీరారు. అయినప్పటికీ ఒక్కో రైతుకు ఒకే ఒక్క యూరియా బస్తా ఇస్తున్నారని అది కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు. అధికారులు స్పందించి యూరియా కొరతా తీర్చాలని రైతులు కోరుతున్నారు.

● చందుర్తి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని రైతు వేదిక వద్దకు యూరియా బస్తాల లారీ రావడంతో రైతులు పరుగున వెళ్లి వరుస క్రమంలో చెప్పులు పెట్టగా, పంపిణీకి బయోమెట్రిక్ యంత్రం లేదని వ్యవసాయశాఖ అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగిన సంఘటన చందుర్తి మండలం మూడపల్లిలో శనివారం జరిగింది. చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి ఐకెపి ఆధ్వర్యంలో శనివారం ఉదయం యూరియా బస్తాల లారీ రావడంతో గ్రామ రైతులు రైతు వేదిక ముందు చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు. వ్యవసాయ శాఖ అధికారులు మూడపల్లికి చేరుకొని యూరియా బస్తాల పంపిణీకి బయోమెట్రిక్ యంత్రంలేదని చెప్పడంతో అధికారులకు, రైతులకు వాగ్వాదం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ఐకేపీ ఆధ్వర్యంలో శనివానం కిష్టంపేటలో యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నందున, బయోమెట్రిక్ మిషన్ లేకపోవడంతో పంపిణీ చేయలేదన్నారు. బయోమెట్రిక్ మిషన్ వచ్చిన తర్వాత ఆదివారం పంపిణీ చేస్తామన్నారు. యూరియా బస్తాల పంపిణీ కోసం రైతుల పేర్లను అధికారులు నమోదు చేసుకున్నారు. దీంతో రైతులు నిరాశతో వెళ్లిపోయారు.



మరిమడ్లలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

గ్రామ పంచాయతీలకు జీపీవోల నియామకం

కథలాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 19 గ్రామాలకు 14 రెవెన్యూ క్లస్టర్లకు గ్రామ పాలనాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని తహసీల్దార్ వినోద్ తెలిపారు. కథలాపూర్ క్లస్టర్‌కు నీరటి గణేశ్, భూషణరావుపేట రత్నాల ప్రశాంత్, పెగ్గెర్ల, ఊటపల్లికి కుంభం ప్రకాశ్, చింతకుంట గోరుమంతుల సుధాకర్, గంభీర్‌పూర్ పిట్ల గజేంధర్, అంబారిపేట, తుర్తికి సిహెచ్ భూమేశ్వర్, కలికోట, పోతారం తలారి యశ్వంత్, తాండ్ర్యాల కోరెం రాజ్‌పాల్, ఇప్పపల్లి మగ్గిడి ప్రశాంత్, దుంపెట, పోశానిపేట బక్కూరి రాకేశ్, దూలూరు బల్గం అనిల్, సిరికొండ బంటు హరికృష్ణ, బొమ్మెన విద్యాసాగర్, తక్కళ్లపల్లి పొట్ట నర్సయ్యలను నియమించారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీ కృష్ణయ్యకు ఘన నివాళి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) కార్యాలయంలో సిరిసిల్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీ కృష్ణయ్య వర్ధంతిని నిర్వహించారు. ఎన్‌వీ కృష్ణయ్య చిత్రపటానికి నాయకులు పూలతో నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, జిల్లా నాయకులు తడక రాములు, గుజ్జ దేవదాస్, సత్తయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లేశం



అరుకుటి మల్లేశం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడుగా అరుకుటి మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. వేములవాడలో శనివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన మల్లేశం ప్రస్తుతం ఎస్‌టీయు మండల అధ్యక్షుడుగా కొనసాగుతున్నాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపాడు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడుగా ఎంపిక కావడం పట్ల పలువురు మల్లేశంకు అభినందనలు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ శబరి విద్యానికేతన్ హై స్కూల్‌లో నాశముక్తి భారత్ అభియాన్, మిషన్ పరివర్తన సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు రకాలు, ఎలా అలవాటు అవుతుంటాయి, వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు జనార్ధన్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యెల్లె శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ

ఎల్లారెడ్డిపేట,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను చేపట్టి అమలు చేయనుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో శనివారం జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక మండల అధ్యక్షుడు లాల్‌మహ్మద్, సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, గౌస్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్ష(టీజీ సీపీ గేట్)లో మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ పురుషుల గురుకులం డిగ్రీ కళాశాల విద్యార్థులు రాకేశ్, ప్రదీప్, అరవింద్, చైతన్యలు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాకేశ్ కంప్యూటర్ సైన్స్‌లో 147వ ర్యాంకు, ప్రదీప్ ఫిజిక్స్‌లో 419వ ర్యాంకు, అరవింద్ జుయాజలీలో 698వ ర్యాంకు, చైతన్య కంప్యూటర్ సైన్స్‌లో 1022వ ర్యాంకు పొందారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న తండావాసులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమ నాలుగు తండాలను కలిసి కేలోతు తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చూస్తూ వీర్నపల్లి మండలం కేలోతుతండా, రెడ్డితండా, శంకర్‌నాయక్‌తండా, అజ్మీరాతండా వాసులు శనివారం ఆందోళనకు దిగారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న పట్టించుకోలేరని ఆగ్రహించారు. తమ తండాలు వన్‌పల్లి పంచాయతీ పరిధిలో ఉండడం వల్ల తాము కనీస మౌలిక వసతులకు నోచుకోలేకపోతున్నామని వాపోయారు. నాలుగు తండాల్లో మొత్తం 130 కుటుంబాలు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. 500పైగా జనాభా ఉండగా, 270మంది ఓటర్లున్నారని తెలిపారు. తండాలు జీపీ నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. తండాలు అభివృద్ధికి దూరంగా ఉంటూ దుర్భర జీవితాలు గడపాల్సిన దుస్థితి దాపురిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కేలోతు తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను తీర్చాలని తండావాసులు కోరారు. కార్యక్రమంలో తండాలవాసులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ, అడ్మిషన్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె సురేందర్‌రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొనే విద్యార్థులు 15, 16 తేదీల్లో తమ ఒరిజినల్ టీసీ, ఇంటర్ మెమో, ఎస్సెస్సీ మెమో, బోనఫైడ్, స్టడీ సర్టిఫికెట్లు (4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు), క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు (వర్తించే వారికి), అన్ని సర్టిఫికెట్ల ఒక సెట్ జిరాక్స్ కాపీలతో కళాశాలలో హాజరు కావాలన్నారు. కోర్సుల వారీగా ఖాళీల వివరాలు బీఎస్సీ లైఫ్ సైన్స్-29, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్-27, బీకామ్ రిటైల్ ఆపరేషన్స్-15, బీకాం ఫైనాన్స్-5, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్-3, బీకాం బిజినెస్ ఎనాలిటిక్స్-2, బీఏ తెలుగు మీడియం-1, మొత్తం 82 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని తెలియజేశారు. కోర్సుల వారీగా ఖాళీగా ఉన్న సీట్లు రోస్టర్ ప్రకారం ఏ కేటగిరి వారికి కేటాయించనివి అనే వివరాలు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా దోస్త్ వెబ్ సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందడానికి ఇది చివరి అవకాశమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ సూచించారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు విద్యార్థుల చొరవ..

తంగళ్లపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నడుం బిగించారు. శనివారం తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ చెత్తను తొలగించారు. దీంట్లో భాగంగా రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను శ్రమదానంతో శుభ్రం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్లాస్టిక్ చెత్తను తొలగించి సామాజిక బాధ్యతను చాటారు. అలాగే సైబర్ మోసాలు, సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. సైబర్‌క్రైం విభాగం శ్రీకాంత్ సైబర్ మోసాల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాణిశ్రీ, కళాశాల అధ్యాపకులు అనుష, సంధ్యరాణి, సుమతి, పీడీ, పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావం పెంపొందించుకోవాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో సేవా భావం పెంపొందించుకోవాలని జాతీయ సేవా సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్ సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారు ప్రత్యేక శిబిరాన్ని నగునూర్ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని రోడ్లను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె మురళి, ప్రోగ్రాం చైర్మన్, ప్రినిపాల్ డాక్టర్ టి మాలతి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ పద్మజ పాల్గొన్నారు.